# On The Small Pox and Cholera

By John W. Gordon అనువాదము : పురుషోత్తము చౌధరి

## మశూచిక విషూచీ సంకటములను గురించి కలిగిన భ్రాంతి నివృత్తి 1862

మనుష్యులలో మశూచకమున్ను విషూచీసంకటమున్ను ప్రబలి నప్పుడు చూచేవారికి భయంకరముగానున్ను దుఃఖకరముగానున్ను వుంటుంది. అదివాస్తవమే - అయితే ఆ సంకటములు అమ్మవారివల్ల వచ్చెనని అనేకులు చెప్పుదురు. అది సరికాదు ఎందుచేతనంటే - చావనయియున్న నరునికి సంకట ములు వుండుట సహజమయే వున్నది. చావు లేకపోతే రోగములున్ను లేకపోవును. చావు వున్నది గనుక సంకటములున్ను వాటి స్వభావరీతిగా వుండకమానవు - అయితే చచ్చుటకు రోగమే కారణమా అని అడిగితే - కాదు. పాపము ముఖ్య కారణమైయున్నది. మరిన్ని ఆ పాపము రోగములకున్ను హేతువుగా వున్నదని వూహించవలెను. వ్యాధియైనా మరణమైనా దేవుని యెరుక లేకనున్ను ఆయన సెలవులేకనున్ను రావు. యెందుకంటే నా తండ్రి సెలవు లేనిది వొక్క తలవెంట్రుకయైనా నేలబడదని ప్రభువైన యేసుక్రీస్తు చెప్పియున్నాడు. మరిన్ని నరజాతి అంతటికీ మూల పురుషుడైన ఆదాము అనునతడు దేవుని ఆజ్ఞను మీరినందువల్ల పాపమున్ను మరణమున్ను భూలోకమునకు వచ్చెను - కాబట్టి నరులలో యిప్పుడు పాపములు యేలాగున పెరుగుతున్నవో రోగములున్ను ఆలాగునే ప్రబలుతున్నవి ఆ పాప రోగములచేత పీడింపబడి నరులందరున్ను మరణమునకు లోనై యున్నారు. కాబట్టి రోగములన్నిటిలో యీ విషూచీ మశూచకములనేవి మిక్కిలి భయంకరమైన సంకటములయి యున్నవి.

నిజము యీలాగున వుండగా ప్రజలు యిది తెలియక ఆ మశూచక రోగము వచ్చినప్పుడు అమ్మవారు అనిన్ని ఆ కురుపులకు మారుపేరుచేత అవి అమ్మవారికుండలనిన్ని అందలిబాధ ప్రబలముగా వున్నప్పుడు

అమ్మవారి మాహాత్యము యిాలాటిదనిన్ని చెప్పుకొందురు - తరువాత దానికొరకు చాలా కానుకలు చెల్లించుటకు మ్రొక్కుకుని ముడుపులు కట్టి చివరకు బహుఘోరమైన క్రూర కృత్యములు జరిగిస్తూ వుందురు. ఆ విషయములను గురించి సంక్షేపముగా కొంత యెత్తి మీకు చూపించుట కున్ను కొన్ని హితవచనములు మీతో చెప్పుటకున్ను మాకు మనస్సు కలిగియున్నది. గనుక ప్రియమైన స్నేహితులారా మీరు కోపము తెచ్చుకొనక ఆలోచనగల మనస్సుతో యిా దిగువను వ్రాసిన సంగతులను విచారించవలెనని మిమ్ములను వేడుతున్నాము.

1. యిా అమ్మవారు యెవరు
2. దాని పూజారులు యెటువంటి వారు
3. అమ్మవారిని కొలుచుటవల్ల వచ్చే నష్టము యేలాటిది
4. ఆ నష్టము తప్పించుకొనుటకు తగిన ఉపాయముయేది.

యిా నాలుగు సంగతులు తేటగా వివరించబడును గనుక చిత్తగించండి.

1ది - అమ్మవారనగా యెవరంటే - ఆది శక్తి యనిన్ని, మాయ అనిన్ని, సైతాను అనిన్ని, పిశాచియనిన్ని, దయ్యము అనిన్ని యిా ప్రకారముగా అనేకులు నానా విధమైన పేర్లు దానికి పెట్టి కొన్ని కొన్ని దేశముల యందున్న ప్రజలు దాన్ని పిలుస్తున్నారు. కానియ్యండి యే పేరయితేనేమి దాని క్రియలు విచారించినప్పుడు వొకటయినా మంచిది లేదుగదా - చూడండి మీ పురాణములు దాని గురించి యేమి చెప్పుతున్నవి. ఈ అమ్మవారనే శక్తి మూడు గుడ్లను పెట్టి వాటిలో ముగ్గురు కొడుకులను కనెననిన్ని ఆ కొడుకులలో వొకడయిన శివుని తనకు పెనిమిటిగా యెంచుకొని వానితో వర్తించెననిన్ని వ్రాసిరి. యిదిగాక ఆ మాయా పిశాచి అబద్ధము కల్పించుటకున్ను, విరుద్ధము పుట్టించుట కున్ను, హత్యనడిపించుటకున్ను, తక్కిన సకల దుర్గుణములను ప్రేరేపించి నరాత్మలను పాడు చేసేటందుకు అదే మూలమై యున్నదని సర్వమతముల వారున్ను తమతమ శాస్త్రముల ప్రకారముగా వొప్పుకొంటున్నారు. మరిన్ని

యీ అమ్మవారనే దయ్యము మహాకాళియనే పేరుతో పూర్వపు రాజుల యొక్క యుద్ధభూములలోకి వెళ్లి పడిపోయిన పీనుగలమీద నాట్యము చేస్తూ రక్తము పానముచేస్తూ వుండేదియని హిందూ గ్రంథకర్తలు బహుగా వ్రాసియుంచినారు. అందుకు నిదర్శనముగా యిప్పుడు నరులు యేమి చేస్తున్నారో చూడండి. యేమంటే - అమ్మవారి పూజకు రక్తమే కావలసియున్నట్టు యెనుపోతులనున్ను, మేకలనున్ను, కోళ్లనున్ను, పందికూనలనున్ను చంపి వాటి నెత్తురు అమ్మవారికి వారపోస్తున్నారు. మరిన్ని కొన్ని స్థలములలో అమ్మవారికి మిక్కిలి ప్రీతియని తలంచి కొన్ని జంతువులను వొక్కమారు చంపక అవి ప్రాణముతో వుండి మిక్కిలి బాధచేత అరుస్తూ వుండగా వాటిని శూలములతో బలిమినిగ్రుచ్చి యెత్తుతూవున్నారు - అయ్యో యిది యెంత ఘోరకృత్యమో చూడండి.

ఇదిగాక మరిన్ని విషూచీ మశూచక సంకటములు యెవరి యిండ్లలో కలవో వారు అమ్మవారిని తృప్తిపరిచే వస్తువులు యివియని యెంచి యిల్లు వూడ్చిన కసవున్ను, తలగొరిగిన వెంట్రుకలున్ను, చింకిచేటలున్ను, మొండి చీపురులున్ను, మొఱ్ఱికుండలున్ను మొదలయిన యీ మయిలవస్తువులు అన్ని ఆ యమ్మవారి భాండాగారమునకు అప్పగించుచున్నారు.

మీద తెలియ చేసిన ప్రకారము కొడుకుతో వర్తించినదిన్ని - క్రూరకృత్యములకు ఆశ్రయమైనదిన్ని పాపములకు పుట్టినిల్లు అయినదనిన్ని సకల మాలిన్యములకు పెంటకుప్పయై యున్నదనిన్ని యిటువంటి నామభేద గుణలక్షణ సంపదలతో ప్రబలుతూ వున్నది యేదో అదే అమ్మవారని మొదటి సంగతి క్లుప్తముగా రుజువుపర్చబడెను.

2వ - యికను ఆ యమ్మవారి పూజారులు యెటువంటి వారో చెప్పెదము. యీ దేశములో బ్రహ్మ క్షత్రియవైశ్య జాతులు మూడున్ను యెక్కువైనవియనిన్ని, నాల్గవదియయిన శూద్రజాతి తక్కువదియనిన్ని మీరు నిర్ణయించు కొంటిరి. అయితే యెక్కువజాతిగల స్త్రీ పురుష సముదాయము

లో ఆత్మశుద్ధిలేక పోయినా ఆచారశుద్ధి గలిగి స్నాన వస్త్రాభరణ వేషభాషా దులచేతను కొందరు నిర్మలముగా కనిపించుదురు. అట్టివారిలో అమ్మవారు ఆవేశించుటకు వొప్పక నెలకు వొక మారు అయినా స్నానము చేయనటు వంటిన్ని కట్టిన మురికి పుట్టము విడువనటువంటిన్ని శూద్రులలో నీచులైన వారియందు మాత్రమే అమ్మవారు ఆవేశించి, వారిచేత తన పూజ నడిపించుకొనుటకు సమ్మతించెను - యికను అటువంటి పూజారుల భక్తి లక్షణములు వివరింతుము యేలాగంటే - వారు పండ్లు పటపట కొరుకుతూ కళ్లు మిటమిట లాడించి మిడి గుడ్లు త్రిప్పుతూ - వొడలు గజగజ వణికించి వూపుతూ వెంట్రుకలు నేలకు జీరాడేలాగున కొప్పులు విప్పి తలలు వూపుతూ పెద్దపెద్ద ఆవలింతలతో కొండి కేకలువేసి తరువాత అమ్మవారి కొరకు శివమాడుదురు. యీ శివాచారులలో కొందరు స్త్రీలు తమ కపటభక్తిని మించిపోయి వొడలెరుగక స్మారకము తప్పి పడి పోతూ వున్నట్టు తమ్మును కనుపరచగా దగ్గిర వున్న పురుషులు వెనుకనుండి వారి భుజమూలములలో చేతులు గ్రుచ్చి కౌగిట దృఢముగా పట్టుకొందురు - మరిన్ని అమ్మవారియందు భక్తిగల బహుపురుషులు దొమ్మిగూడి విపరీతమైన వేషములను ధరించి వేప రొడ్డలైనా, బెత్తములైనా చేతులతో పట్టుకొని వాద్యగాండ్లయొక్క తాళానుగుణ్యముగా గంతులువేసి నాట్యమాడుతూ ప్రతివీధి తిరిగి అమ్మవారికి పండుగ చేతురు - యింకా చెప్పతీరనివి అనేకములు ఆ భక్త వర్గములో కలవుగాని యింతమట్టుకు చాలింతము. ఇదుగో వీరే అమ్మవారికి పూజారులు, వీరే ఆమెకు నిజభక్తులని చెప్పబడిరి.

చూడండి, యీ పూజారులయొక్క బహిరంగపు భక్తియే యింత యెన్నదగినదిగా వున్నప్పుడు వీరి అంతరంగపు భక్తి మరియెంత తీవ్రముగా వుండునో అది యెవరికి తెలుసును. అయినప్పటికీ బుద్ధిమంతులైన వారు తెలుసుకొనుటకు అసాధ్యములేదు - మరిన్ని అమ్మవారియొక్క నిజరూపము యెవరూ చూడ జాలనప్పటికీ దాని శివాచారులయొక్క యున్న భక్తులయొక్కయున్న వేషభాషానటనల శృంగారము కన్నులారా

చూచినట్టయితే యింకా అమ్మవారిని వేరే చూడవలెనా? యెందుకంటే - యథాదేవా-స్తథాభక్తాః అనే ప్రమాణముచొప్పున అమ్మవారికిన్ని ఆమెభక్తులకున్ను యేవిషయమందున్ను భేదము వుండదు.

అయితే యిక్కడ యరియొక సంగతి మేము చెప్పవలసియున్నది - యేదంటే బ్రహ్మక్షత్రియవైశ్యులు అనే మొదటి కులములవారు తమ పరువున్ను సిగ్గున్ను కాచుకొనుటకై అటువంటి శివాచారుల వుద్యోగములో ప్రవేశించక పోయినప్పటికిన్ని తమకంటే నీచాతి నీచముగా తాము యెంచుకున్న యితరజాతి శివాచారులను పెద్దచేసి మన్నించి-ఆ వెజ్జురాండ్లు చెప్పిన సోదెలు వొప్పుకొంటూ వాండ్లు చేయుమని ఆజ్ఞాపించిన ఆనాచారవిధులన్ని చేస్తూ వున్నారు. అయితే అగ్రజాతి యగువారిలో కొందరుకొందరు అమ్మవారికి నెత్తురు వారపోయనప్పటికిన్ని మొక్కుబడులను చెల్లించుటయున్ను ఆనాచారవిధులు జరిగించుటయున్ను మానలేదు. అమ్మవారిపూజారులను గురించి యీమట్టుకు రుజువు పర్చితిమి.

3ది - యిప్పుడు మూడవ సంగతిని పట్టి అమ్మవారిని పూజించుట వల్ల వచ్చే నష్టమును తెలియజేతుము.

ప్రజలు నిర్ణయించుకొన్న కాలములలో అమ్మవారికి చేయగల పండుగ మొక్కుబడుల నిమిత్తమున్ను అమ్మవారికి దూతలైన యెల్లమ్మ, పోతన్న, గుంటలారు, గురప్ప, మొదలైన లెక్కలేని చిల్లర దయ్యముల కొలువు నిమిత్తమున్ను మరిన్ని అమ్మవారి సంతతికి పీఠస్థానములుగా యేర్పరిచిన కాశి, కంచి, తిరుపతి, జగన్నాథము, శ్రీకూర్మము, సింహాచలము, యీ మొదలైన క్షేత్రములను చూచుటకు యాత్రలు సేయుటవల్లనున్ను యింకా చెప్పతీరని వ్రతములు, క్రతువులు, నోములు, వుత్సవములు, అనేకములు వున్నవి. వాటికొరకున్ను యెంతసొమ్ము వ్యయమైపోతూ వున్నదో దాని మొత్తము యింతంత అని యెవరు చెప్పగలరు. యీ నష్టము యెంత పెద్దదిగా వున్నదో చూడండి. అటువంటి

దూరదేశ సంచారము చేసినప్పుడు ధననష్టమే కాకుండా పురుష వియోగినులైన స్త్రీలకు మాననష్టము యెంతగా ప్రబలుతున్నదో ఆలోచించండి. మరిన్ని అందువిషయమై అన్యోన్య కలహములచేత ప్రాణనష్టము యెంతగా జరుగుతున్నదో విచారించండి. యీనష్టమంతటికీ కారణమేమిటి అంటే అమ్మవారినిన్ని తత్సంబంధులనున్ను పూజించుటవల్లనేకదా యీ నష్టములు వచ్చెను. స్నేహితులారా, యింతే కాదు మరియొక మహా నష్టమున్ను వున్నది. దాని గురించి మీరు వినేటప్పుడు భయముతోనున్ను వణుకుతోనున్ను వినవలెను. అది యేదంటే.

సమస్తమును సృష్టించి పరిపాలన చేస్తూవున్న దేవుడు ఒక్కడే. సర్వశక్తి-సర్వజ్ఞత్వ-సర్వాధికారములు ఆ యొక్కనియందే గలవు. కాబట్టి ఆయన యెదుట మరియొక దేవుడయినా, దేవియైనా బదలుగా వుండకూడదు. వుంచతగదు. ఆ సర్వకర్త పాపము చేసిన నరులను నానా విధములయిన రోగములవల్లను శిక్షిస్తూ వున్నాడు. అది యేల్గాగంటే తప్పుచేసిన పిల్లలను తండ్రి రువ్వచేత యేలాగున శిక్షించునో ఆ విధముగా సంకటములనే రువ్వలచేత దేవుడు నరులను కొట్టుతున్నాడు. ఆ దెబ్బలలో మశూచకమనేది వొక గట్టి దెబ్బయై యున్నది. నరులు గుణపడి బుద్ధి తెచ్చుకొని మేలు పొందుటకై దేవుడు వారిని యీ రోగము లతో మొత్తినప్పుడు యిది దేవుని దెబ్బగదాయని వారు తలంచి దేవునికి భయపడి ఆయన తట్టు మనస్సు తిప్పుకొనవలెను. అయితే వారు అలాగున చెయ్యక కఠినత్వము వహించి మరింత యెక్కువగా తమ్మును తాము చెరుపుకొని మీద చెప్పబడిన అమ్మవారనే పిశాచమునున్ను దాని దూతల నున్ను పూజించి చెప్పతీరని పాపక్రియలు చేస్తూ వున్నారు. అందువల్ల దేవుడు వారిని విడిచిపెట్టెను. మరిన్ని ఆయన ఉగ్రత్వము వారిమీద పడి యున్నది. అధికమైన రోగములు వచ్చి వారి శరీరములను కొట్టి నాశనము సేయుచున్నవి - యీలాగువ దేవుడు పంపించిన రోగములను

దయ్యము యేలాగు పోగొట్టగలదు – దేవుని పంపున వచ్చే దెబ్బలను దయ్యముయేలాగున తప్పించగలదు. దేవునికిన్ని దయ్యమునుకున్ను సంబంధము యేమిటి. వెలుగుకున్ను చీకటికిన్ని అన్యోన్యత యెక్కడిది? వొకడు సింహమువల్లను చీల్చబడుతూ వుండి వాడు వొక గార్ధభమును చూచి నన్ను బ్రతికించుమీయని మొర్రబెట్టితే అది వానికి సహాయము చేసి సింహమునుంచి విడిపించగలదా? మరి వొకడు రాజాజ్ఞ మీరి దండించబడుతూ వున్నప్పుడు సమీపమందున్న ఒక కుక్కను చూచి నన్ను రక్షించుమీ యని దాన్ని వేడుకొన్నట్టయితే అది వాని విమోచించునా? కాబట్టి ప్రియమైన జనులారా మీరు దేవుని అలక్ష్యపెట్టి మశూచకాది సంకటములకు అమ్మవారలే హేతువులని చెప్పి యెంతకాలము మీరు ఆ దయ్యముల పూజలు నడిపింతురో అంతపర్యంతమున్ను దేవుడు మీ యందు అసహ్యపడి మిమ్మును విడుచును. రోగములున్ను మరీయెక్కువగా ప్రబలును. చివరకు మృత్యువు తన నోరు తెరుచుకొని వచ్చి మీ ప్రాణములను పట్టి మ్రింగును. అప్పుడు మీ ఆత్మలు న్యాయపు తీర్పు పర్యంతము నరక కూపము వొద్దున నివసించి యుండును – అయ్యో యీకీడు యెటువంటిది యీ నష్టము యెంత పెద్దది. దీని మీరు ఆలోచించి చూడరాదా.

ఇదిగాక ప్రియమైన హిందువులారా మీ శాస్త్రోక్త ప్రకారముగా ఆ అమ్మవారికి పుట్టినటువంటి శివ విష్ణుల యొక్క వంశస్థులైన గణేశుడు, వీరభద్రుడు, సింహాచల వరాహ నరసింహుడు, శ్రీ కూర్మనాయకుడు – యీ మొదలయిన వారంతా అమ్మవారి బలగమై యుండగా వారి కొరకు మీరు విగ్రహములను పెట్టి పూజించి మొక్కుతూ వున్నారు. అందువల్ల మీకు యే మాత్రపు మేలైనా దొరుకునా? దొరకకపోవడము సరేకదా యింతంతనరాని దేవుని కోపాగ్ని మీ మీదకి దిగివస్తున్నది. యేమంటే – పరిశుద్ధ నీతి న్యాయములు గల సర్వోన్నతుడైన యెహోవాయనే దేవుడు తన యెదుట యితర దైవతములు కలిగి యుండ కూడదనిన్ని, యెటువంటి రూపము గల విగ్రహములయినా కలుగజేసి వాటికి మ్రొక్కి

ఆరాధన చేయవద్దనిన్ని , ఆలాగున చేసినవారు తనకు పగ వారనిన్ని తాను రోషముగల దేవుడనినిన్ని, తనకు విరోధముగా నడిచిన వారలయొక్క అక్రమమును వారి పుత్రులయొద్దనుంచి మూడు నాలుగు తరములమట్టుకు విచారణ చేసేవాడనై యుందుననిన్ని యీలాగున దేవుడు ఆజ్ఞాపించి యున్నాడు. ఆ దివ్యాజ్ఞలు మీరు గైకొనక మీరిపోతున్నారు. అందువల్ల మీ పాపము అమితమై యున్నది. ఆ పాపమునుంచి మీ ఆత్మలు నిత్యనాశనమైన భయంకర నరకాగ్నిలో పడవలసి యున్నవి - అయ్యో, యింత గొప్ప నష్టము తప్పించుకొనుటకు మీకు వుపాయము వున్నదా? అటువంటి సదుపాయము మీలో లేదని మాకు తెలిసి యుండి మీ కొరకు విచారపడుతున్నాము.

4ది - యీ నష్టము తప్పించుకొనుటకు తగిన యుపాయము యేదంటే - మనకందరికిన్ని సృష్టికర్తయై యున్న దేవుడు తన నీతి న్యాయములకు భంగము రాకుండా కృపయొక్క యొడంబడికె యొకటి తనకు తానే యేర్పరిచి పాపులు రక్షింపబడుటకు మంచి వుపాయము ఆయనే కలుగ జేసెను. అది యే విధమయినదంటే పాపాత్ములు న్యాయరీతిని దండన పొందవలసి యున్నది గదా. అయితే వారిని దండించుటకు బదులుగా దేవుడు తన ప్రియకుమారుడైన యేసుక్రీస్తు మీద ఆ శిక్షను విధించి పాపులనిమిత్తమై ప్రాయశ్చిత్తపు బలిగా ఆ పుణ్యపురుషుని నిర్ణయించినాడు. గనుక, ఆ ప్రాయశ్చిత్తమును నమ్మిన వారందరూ దేవుని యుచితార్థమైన కృపవల్ల పాపవిమోచనమున్ను నిత్యరక్షణయున్ను పొందుదురు. యెంత చెడ్డ పాపము చేసిన యేనరులైనా తమ పాపము కొరకు మనస్తాపపడి యితరములైనా దేవీ దైవతములను విడిచి ప్రభువైన యేసుక్రీస్తును నమ్మి తమ సృష్టికర్తయైన దేవుని తట్టు మళ్లినట్టయితే వారు క్షమాపణను పొంది రక్షణ భాగ్యము అనుభవించుదురు.

మరిన్ని దేవ స్వభావము గల పరిశుద్ధ నరావతారము ధరించిన ఆ యేసు క్రీస్తు సర్వజీవుల యెడల మిక్కిలీ దయాళుడు గనుక ఆయన పాపుల నిమిత్తము పొందిన మరణ ప్రయానములు యెవడు తన నిండు మనస్సుతో తెలుసుకొని నమ్మి ద్యానించునో వాని హృదయము రాతివంటిదై యున్నప్పటికి అది కరుగక మానదు. మరిన్ని క్రీస్తుయొక్క ప్రేమామృతరసము విశ్వాసి హృదయములోకి దిగుటవల్ల అంటుకట్టిన చెట్టువలెనే అతనికి మంచి ఫలములు ఫలించును. అనగా వాని హృదయము మార్పు పొంది సుగుణవంతుడవును. అయితే అమ్మవారిని నమ్మినవారికి దాని దుర్గుణములు తప్ప సుగుణములు యేలాగు దొరుకును. ముసిడి చెట్టును యెంత ఆశ్రయించినా అరటిపండ్లు దొరుకునా? కాబట్టి స్నేహితులారా ఆ అమ్మవారి యొక్క కఠినమైన కొలువున్ను దాని సంబంధులయొక్క సాంగత్యమున్ను మీరు విడిచిపెట్టి మిమ్మును పుట్టించిన దేవుని తట్టు తిరగండి. త్వరగా తిరగండి. మీ పాపపరిహారము కొరకున్ను మీ నిత్యసుఖము కొరకున్ను దేవుడు దయచేసిన యేసు క్రీస్తును మీరు నమ్మి ఇహమందు మనశ్శాంతియున్ను పరమందు నిత్యజీవానందమున్ను అనుభవించండి. యిదే నరులకందరికిన్ని దేవుడు యిచ్చిన సదుపాయము. యిది తప్ప వేరే మరియొక వుపాయము లేదు. కాబట్టి స్నేహితులారా యీ వుపాయము మీరు గైకొనవలెనని మిమ్మును బతిమాలుతున్నాము.

ప్రభువైన యేసు క్రీస్తు తన జనులయొక్క పాపపరిహారము కొరకు మరణమై తరువాత తిరిగీ లేచి పరోకమునకు వెళ్లియున్నాడు. ఆయన తిరిగీ వస్తాడు. వచ్చి చనిపోయిన నరులనందరిని మంటిలో నుంచి లేవనెత్తి వారి వారి క్రియల చొప్పున అందరికిన్ని ప్రతి ఫలములు యిచ్చును. అయితే ఆ తీర్పు దిన మందు అమ్మవారనే పిశాచినిన్ని దాని దూతలనున్ను వాటితట్టు చేరి సకల దుర్మార్గములలో నడిచిన నరులనందరినిన్ని నరకమనే ఆరని అగ్నికుండములో తోయించును.

అయితే తనను నమ్మినవారికి తనతో కూడా మోక్షరాజ్యములో నిత్యజీవానందము దయచేస్తాడు. ఆయనకు సర్వాధికారము కలిగి యున్నది. యీ వాక్యములు దేవుని పరిశుద్ధ గ్రంథములో వ్రాయబడి యున్నవి. మీరు ఆ గ్రంథమును సంపాదించి ఆ దివ్యవాక్యములు యెత్తి చదివి విని విశ్వసించి సుఖము పొందుదురు గాక.